క్లుప్తంగా

ఘనంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం ఆవాహిత దేవతాపూజ, ధాన్యాధివాసం , హోమం చేశారు. 24న యంత్ర ప్రతిష్ఠ, అమ్మవారి విగ్రహ స్థాపన, కలవస్థాపనం, అభిషేకం, నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు తెలిపారు. పెద్ద సంఖ్యలో హాజరవుతున్న భక్తులకు పూర్తి స్థాయిలో వసతులు ఏర్పాటు చేశారని వారు పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలో గ్రామ పంచాయతీ కార్మికులు ఆందోళన చేపట్టారు. మూడు నెలలుగా తమకు వేతనాలు చెల్లించడంలేదంటూ అధికారులు, పాలకుల తీరును నిరసిస్తూ గ్రామంలో భిక్షాటన చేశారు. గ్రామాల్లో పారిశుధ్య సేవలు నిర్వహించే కార్మికులు పేద దళితులని, తమపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం దారుణమన్నారు. తమకొచ్చే అరకొర వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడంతో పలు కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, వేతనాలు వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల్లో పశువులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్య సిబ్బంది మహేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం పేటతో పాటు మండల పరిధిలోని జూకల్ గ్రామాల్లో 1,448 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది, గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌కు ఆహ్వానం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సునీతారెడ్డి

నర్సాపూర్: మార్షల్ ఆర్ట్స్ పోటీలు, బహుమతుల అందజేత కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి గురువారం మార్షల్ ఆర్ట్స్ మాస్టర్లు స్వామి, రాంచందర్‌లు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గురువారం సునీతారెడ్డి క్యాంపు కార్యాలయంలో మార్షల్ ఆర్ట్స్ కరపత్రాలు ఆవిష్కరించారు. 26న ఉదయం నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్‌లో డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నామని వారు చెప్పారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, షేక్ హుస్సేన్, మహ్మద్ షరీఫ్, మాస్టర్స్ పాల్గొన్నారు.

సన్మానం



ఎస్‌ఐ శివకుమార్‌ను సన్మానిస్తున్న ఉపసర్పంచ్‌లు

నర్సాపూర్: మండల ఉపసర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల బాధ్యతలు తీసుకున్న ఎస్‌ఐ శివకుమార్‌ను గురువారం సన్మానించారు. మండల ఉప సర్పంచ్‌ల ఫోరం మండల శాఖ అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు ఉప సర్పంచ్‌లు కదారి నాగరాజు, గణేశ్, వినోద, ధన్సింగ్, కిషన్, మల్లేశ్, ఫూల్‌సింగ్ తదితరులు ఎస్‌ఐని కలిసి సన్మానించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజాప్రతినిధులు తమకు సహకరించాలని కోరారు.

ఆర్థికసాయం

శివ్వంపేట(నర్సాపూర్): పేద కుటుంబాలకు జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా గురువారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన మల్లయ్య కూతురు వివాహానికి, అలాగే చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన జాతీయ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ కూతురు వివాహానికి రూ. 5 వేల చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, బీఆర్‌ఎస్ నాయకులు పాపయ్యచారి, అంజాగౌడ్, నజీర్ ఉన్నారు.

పాఠశాలలో పురుగుల అన్నం

- ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుంటున్న విద్యార్థులు
- మూడు రోజులుగా మధ్యాహ్న భోజనం బంద్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



బహిరన్‌దిబ్బ పాఠశాలలో ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకున్న విద్యార్థులు

అల్లాదుర్గం(మెదక్): పాఠశాలలో విద్యార్థులు పురుగుల అన్నం తినలేక అవస్థలు పడుతున్నారు. కొన్ని నెలలుగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలకు నాణ్యత లేని పురుగుల బియ్యం సరఫరా చేస్తున్నారు. పౌరసరఫరా అధికారులు నిర్లక్ష్యదోరణి, విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. పురుగుల అన్నం తినలేక పేద విద్యార్థులు ఇంటి నుంచే టిఫిన్ బాక్సులు తెచుకుంటున్నారు. దీంతో వారి తల్లిదండ్రులు వంట కార్మికులు, టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వంట కార్మికులు వంటలు చేయడం మానేయడంతో మూడు రోజులుగా మధ్యాహ్న భోజనం బంద్ అయింది. ఈ సంఘటన అల్లాదుర్గం మండలంలోని బహిరన్‌దిబ్బ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం చోటు చేసుకుంది.

- అల్లాదుర్గం మండలంలోని ప్రభుత్వం పాఠశాలలకు పెద్దశంకరంపేట పౌరసరఫరా గోదాం నుంచి బియ్యం సరఫరా అవుతుంది. కొన్ని నెలలుగా పాఠశాలలకు నాణ్యత లేని పురుగులు పట్టిన బియ్యం సరఫరా చేస్తున్నారని టీచర్లు ఆరోపిస్తున్నారు. మండల విద్యాధికారి స్వయంగా గోదాం ఇన్‌చార్జ్‌కి ఫోన్ చేసి అగ్రహం వ్యక్తం చేసిన ఫలితం లేదు.
- బహిరన్‌దిబ్బ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అన్నంలో రోజు తెల్లటి పురుగులు వస్తున్నాయి. కొందరు విద్యార్థులు భోజనం చేయకుండా ఇళ్లకు వెళ్తున్నారు. మరి కొందరు పేద విద్యార్థులు మాత్రం ఆకలికి తట్టుకోలేక అదే అన్నం తింటున్నారు.
- అన్నంలో పురుగులు రావడంతో తల్లిదండ్రులు వంట కార్మికులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు వచ్చిన బియ్యమే వండుతున్నామని, బియ్యంలో పురుగులు కనిపించడం లేదని, అన్నంలో మాత్రం కనిపిస్తున్నాయని చెప్పారు.
- అన్నంలో పురుగులు రావడం పై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో వంట కార్మికులు మధ్యాహ్న భోజనం వండటం మానేశారు.
- పాఠశాలలో మూడు రోజులుగా మధ్యాహ్న భోజనం బంద్ అయినా.. సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు మాత్రం అసలు పట్టించుకోవడం లేదు.
- పెద్దశంకరంపేట గోదాంకు సరఫరా అయ్యే బియ్యం అధ్వానంగా ఉన్న ఎవరు పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్ నాణ్యత లేని బియ్యం సరఫరా చేస్తున్నరనే విమర్శలున్నాయి. కొన్ని నెలలుగా కాయిదంపల్లి, చిల్వెర, నడిమితండా, బహిరన్‌దిబ్బ పాఠశాలలకు జాలిపట్టి పురుగుల బియ్యం సరఫరా చేస్తున్నారు.
- ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భోజనం అందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దొడ్డు పురుగులు వచ్చాయి



మధ్యాహ్న భోజనంలో బొద్దింక లాంటి పురుగులు వచ్చాయి. పురుగులు చూసి అన్నం తినలేక ఇంటికి వెళ్లిపోయా. ఈ విషయం మా అమ్మనాన్నలకు చెప్పాను. దీంతో వాళ్లు స్కూల్‌లో భోజనం వద్దని టిఫిన్ బాక్స్ ఇస్తున్నారు.

– భార్గవి, యూపీఎస్, బహిరన్‌దిబ్బ

బుక్క పెట్టుకోలేం



పాఠశాల మధ్యాహ్న భోజనంలో బుక్క పెట్టుకుంటే పురుగు కనిపించింది. అన్నం తినలేదు. రోజు అన్నంలో పురుగులు వస్తున్నాయి. మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇంటి నుంచే టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నాం.

– అభిలాష్ విద్యార్థి, బహిరన్‌దిబ్బ

చర్యలు తీసుకుంటాం



పాఠశాలకు పురుగుల బియ్యం సరఫరా చేస్తున్నారని కాంట్రాక్టర్‌ను ఫోన్‌లో ప్రశ్నిస్తే, ఉన్న బియ్యం సరఫరా చేస్తామని, లేకుంటే మెదక్ వచ్చి బియ్యం తీసుకెళ్లాలని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టేలా చర్యలు తీసుకుంటాం.

– సత్యకుమార్, హెచ్‌ఎం, బహిరన్‌దిబ్బ

ఘనంగా సంత్‌గాడ్గే బాబా జయంతి



గాడ్గేబాబా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

మెదక్‌జోన్: స్వచ్ఛభారత్ సృష్టి కర్త సంత్ గాడ్గే బాబా జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పసుపులేరు ఒడ్డున ఉన్న సంత్ గాడ్గే బాబా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా సామాజిక సమరసత వేదిక అధ్యక్షుడు మచ్చేంద్రనాథ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి గాడ్గే బాబా విగ్రహం మన మెదక్ పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో గత ఏడాది ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయమని, గాడ్గే బాబా జీవితం నేటి యువతకు ఆదర్శమని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వర్సపల్లి నర్సింలు, జిల్లా రజక సంఘం యూత్ అధ్యక్షుడు విజయ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు మల్లయ్య, పోచయ్య, భూషణం తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నర్సాపూర్: మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా ఉన్న మూల మలుపు వద్ద కేబుల్ వేసేందుకు తవ్వకాలు జరుపడంతో మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసమైందని చెప్పారు. గురువారం పైపులకు మరమ్మతులు చేయించి, నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు ఆయన వివరించారు.

26న దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ

అల్లాదుర్గం(మెదక్): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 26న తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరిస్తారని అందోల్ నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడు లేఖీ రమేశ్ గురువారం అల్లాదుర్గంలో విలేకర్లతో చెప్పారు. అదే రోజు కురుమ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని కురుమ సంఘం నాయకులు, కులస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): సైబర్ నేరాలపై విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. గురువారం కౌడిపల్లి బాలికల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం స్వరూపరాణి ఆధ్వర్యంలో విద్యార్థులతో సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు కోసం మాత్రమే సెల్‌ఫోన్ వినియోగించాలన్నారు. బ్యాంక్ నంబర్లు, ఓటీపీలు గుర్తు తెలియని వ్యక్తులకు చెప్పొద్దన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి లాటరీ తగిలిందని, బ్యాంక్ లావాదేవిలు, ఆధార్‌కార్డులు అప్‌డేట్ చేస్తున్నామంటూ మాయమాటలు చెప్పి, ఓటీపీలు అడుగుతారని, కానీ వాటిని చెప్పవద్దన్నారు. ఓటీపీలు చెప్పడం వల్ల బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు కాజేస్తారని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ షాపింగ్ పేరిట మోసాలు జరుగుతాయన్నారు. తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధగా చదివి అభివృద్ధిలోకి రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, ఉమా, మంజుల, స్వప్న, లావణ్య, సుజాత, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రుణమాఫీ చేస్తాం ’



గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాయిన్‌చెరు తండాలో కాంగ్రెస్ నాయకుల ఆత్మగౌరవ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తండాలోని గిరిజనుల సమస్యలను శ్రీనివాస్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాబోయిన శ్రీనివాస్, గణేశ్ స్టాలిన్, నర్సింలు, రాజు, రమేశ్, అరుణ్‌కుమార్, బద్యానాయక్, శంకర్ నాయక్, లింగం, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

భక్త మార్కండేయ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

నర్సాపూర్ రూరల్: మండలంలోని రెడ్డిపల్లిలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం భక్త మార్కండేయ ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి మెదక్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు జయరాములు, నర్సాపూర్ పద్మశాలి సంఘం నాయకులు రమేశ్, కంది ప్రభాకర్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అశోక్‌గౌడ్, శేఖర్, శేఖర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కంటివెలుగు శిబిరం ప్రారంభం**

చిన్నశంకరంపేట(మెదక్): ప్రతీ ఒక్కరికి కంటి వెలుగు పరీక్షలు చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధు కోరారు. గురువారం మండలంలోని ధరిపల్లి గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సర్పంచ్ సిద్దిరామ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, అంజాగౌడ్, లింగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, డాక్టర్ సాయి కుమార్, ఏఎన్‌ఎం నర్సమ్మ తదితరులున్నారు.

◆ **దుస్తుల పంపిణీ**



దుస్తులు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్

మెదక్ మున్సి పాలిటీ: మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్, నీటి సరఫరా సిబ్బందికి గురువారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, డీఈ మహేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్, నాయకులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత



శివ్వంపేట(నర్సాపూర్): గోమారంలో బాలల పరిరక్షణ కమిటీ కరపత్రాలతో ప్రజాప్రతినిధులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): గౌతాపూర్‌లో..



మనోహరాబాద్(తూప్రాన్): కోనాయపల్లి(పీటి)లో..

శివ్వంపేట(నర్సాపూర్): బాలల పరిరక్షణ అందరి బాధ్యత అని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్య అన్నారు. గురువారం మండలంలోని గోమారం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వీసీపీసీ(విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొడక్షన్ సెల్, గ్రామ బాలల పరిరక్షణ కమిటీ) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలల పరిరక్షణ కోసం ఏర్పాటు చేస్తున్న వీసీపీసీ కమిటీలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సంతోష ఉన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): బాలల పరిరక్షణే లక్ష్యంగా బాలల పరిరక్షణ కమిటీ పని చేస్తుం దని సర్పంచ్ స్వరూప అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో గురువారం బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో బాల్య వివాహాలు, శిశు విక్రయాలు, బాలకార్మిక వ్యవస్థ, బాలబాలికలపై జరుగుతున్న హింస, పిల్లల అక్రమ రవాణా తదితర వాటిని జరగకుండా పరిరక్షణ కమిటీ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, కార్యదర్శి దుర్గ, పాఠశాల హెచ్‌ఎం సర్వన్, ఎస్‌ఎంసీ చైర్మన్ యాదయ్య, వార్డు సభ్యుడు ఆశోక్, మహిళా సంఘం సభ్యురాలు మల్లీశ్వరి, నాయకులు విఠల్, శంకరయ్య, రామకిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో బాలల పరిరక్షణ కోసం, నూతన కమిటీల ఏర్పాటుకు సర్పంచ్‌లు గ్రామ సభలను నిర్వహించారు. కోనాయపల్లి(పీటీ), గౌతోజీగూడెం గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించి తీర్మానం చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, సర్పంచ్‌లు ప్రభావతి, వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్‌లు ధర్మేందర్, రేణుకుమార్, కార్యదర్శులు నవీన్‌కుమార్, నందిని, అంగన్‌వాడీ టీచర్లు, ఎఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): బాలల హక్కులకు, రక్షణకు భంగం కలగకుండా చూసేందుకు మండల కేంద్రం కొల్చారంలో గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీని ఎంపిక చేశారు. గ్రామస్థాయిలో వివిధ విభాగాలకు చెందిన సంస్థల్లో పనిచేస్తున్న వారిని ఈ కమిటీలో సభ్యులుగా ఎన్నుకున్నామన్నారు. సర్పంచ్ ఉమాదేవి చైర్మన్‌గా, కన్వీనర్‌గా అంగన్‌వాడీ టీచర్ మేఘమాల, సభ్యులుగా గ్రామస్థాయిలో పనిచేస్తున్న వారిని ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు



సీమంతం, అన్నప్రాసన చేస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం అంగన్‌వాడీ టీచర్లు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అలాగే చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంతోష మాట్లాడుతూ... ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు నిర్దేశించిన మెనూ లబ్ధిదారులకు తప్పకుండా అందించాలని అన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రాల్లో సామాజిక వేడుకలు నిర్వహించాలని టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ఉన్నారు.

వార్షికోత్సవాలకు సర్వం సిద్ధం

- ముస్తాబైన గీతా మందిరం
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



ముస్తాబైన గీతా మందిరం



ఆలయంలో కొలువుదీరిన గోపాలకృష్ణుడు

తూప్రాన్: పట్టణంలో అత్యంత విశేషమైన గీతా మందిరం పంచదశ (15)వ వార్షికోత్సవాలు రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ఆశీస్సులతో ఈ నెల 27 నుంచి మార్చి 1 వరకు నిర్వహించేందుకు గీతా భక్తసమాజ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.


గీతా మందిరంలో ప్రధాన మూర్తిగా శ్రీగోపాలకృష్ణస్వామితో పాటు శివ పంచాయతన సమేత రామలింగేశ్వరస్వామి, హనుమత్ సీతాలక్ష్మణ సమేత రామచంద్రస్వామి, గణపతి, పంచముఖ ఆంజనేయస్వామి, వాసవీ కన్యకాపరమేశ్వరీ, నవగ్రహాలు, సద్గురు దత్తాత్రేయ స్వామి, సద్గురు శబరిమాత విగ్రహాలు ఉన్నాయి.

- భక్తులు ఆలయంలో నిత్యం అర్చన, అభిషేకాలు, భగవద్గీతలోని ఒక అధ్యాయనం చేస్తూ ప్రతి ఏకాదశీ రోజున భగవద్గీత సంపూర్ణ పారాయణం, గీతా జయంతి రోజున పారాయణ, హవనములు నిర్వహిస్తున్నారు. అలాగే కృష్ణాష్టమి, శ్రీరామనవమి, శివరాత్రి రోజున శివ కల్యాణం, హనుమత్ జయంతి, వాసవీ కన్యకాపరమేశ్వరీ జయంతి, గురుపూర్ణమ దత్తజయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు.

27 నుంచి మార్చి 1 వరకు పూజలు

- 27న ఉదయం వేద స్వస్తి, శ్రీవిఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, గోపూజ, పంచగవ్య మేళన, ప్రధాన కలశ స్థాపన, గణపతి హోమం తదితర పూజలు, రాత్రి 8 గంటలకు మహా మంగళ హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ.
- 28న ఆవాహిత స్థాపిత దేవతా పూజ, 108 సంఖ్యగా పురుషసూక్త, పారాయణ పూర్వక 108 కలశాల అర్చన, 108 లీటర్ల పాలతో గోపాల కృష్ణస్వామికి అభిషేకం, లక్షపుష్పార్చన, మహా మంగళహారతి, మంత్రపుష్పం.
- 1న రుద్రహవనం, నవగ్రహ హోమాలు, మహా పూర్ణాహుతి, రుక్మిణి కృష్ణుల కల్యాణం, కలషోద్వాసన తదితర పూజలు నిర్వహించడంతో పాటు మూడు రోజుల పాటు శ్రీమాధవానంద సరస్వతీ స్వామివారి అనుగ్రహభాషణ, భక్తులకు అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక



చిలప్‌చెడ్(నర్సాపూర్): మాట్లాడుతున్న ఎంపీడీఓ శశిప్రభ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రణాళికతో పాటు మండలంలోని అధికారుల సహకారం అవసరమని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. గురువారం మండల కేంద్రం చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వినోదరెడ్డి అధ్యక్షతన, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, కార్యదర్శులతో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శశిప్రభ, ఎంపీఓ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రతీ గ్రామంలో నిర్వహించే జీపీడీపీ లక్ష్యాల గురించి వివరించారు. 2023–24 సంవత్సరానికి గానూ ప్రతీ శాఖకు సంబంధించిన అధికారి సహకారంతో గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పంచాయతీలోని టైడ్ నిధులు 60 శాతం నీటి సమస్యలు, పారిశుధ్యానికి ఖర్చు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విశ్వంభర, మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, ఎంపీటీసీలు మల్లయ్య, సునీత, తహసీల్దార్ ముసాద్దిక్, ఏపీఓ శ్యాంకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్వేష్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష, అటవీశాఖ అధికారి రిజ్వానా, ఏపీఎం ప్రేమలత, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలి

ఈ నెల 27 తేదీ వరకు మండలంలోని ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. గురువారం ఆమె మండల కేంద్రం చిలప్‌చెడ్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. ప్రతీ పంచాయతీలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల సమస్యలు పరిష్కరించడంలో కార్యదర్శులు కృషి చేయాలని, గ్రామాల్లో బాల సభలు, మహిళా సభలు నిర్వహించాలని తెలిపారు. ప్రతీ కార్యదర్శి సెగ్రిగేషన్, నర్సరీ, వైకుంఠధామం, పల్లెప్రగతి ఫొటోలు తీసిపెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్యాంకుమార్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



పెద్దశంకరంపేట(మెదక్): పేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలని, హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. డంప్‌యార్డుల నిర్వాహణ, చెత్త సేకరణ, పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ విఠల్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ సుధాకర్ తదితరులున్నారు.